అర్బన్‌లో అభివృద్ధి శూన్యం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ
- అన్ని డివిజన్ల చౌరస్తాల్లో స్ట్రీట్ కార్నర్స్ సమావేశాలు


మాట్లాడుతున్న బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన 9 ఏళ్లలో నిజామాబాద్ అర్బన్‌లో చేపట్టిన అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. గురువారం నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ అర్బన్‌లో ఎన్ని నిధులతో.. ఏయే అభివృద్ధి పనులు చేపట్టారో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఏళ్ల తరబడి పనులు చేపడుతూ కమీషన్ల కోసం అంచనా వ్యయం పెంచుకుంటూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. అర్బన్‌లో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇంటిని పంపిణీ చేయలేదని, దళితబంధు పథకం కేవలం బీఆర్ఎస్ వారికే పరిమితమైందని, అర్హులకు ఇవ్వడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే అండతో భూ కబ్జాలు, అక్రమ దందాలు చేస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని, నగరంలో ఎంతోమంది అంతర్జాతీయ క్రీడాకారులున్నా.. ప్రాక్టీస్ చేసేందుకు మైదానం లేకుండా చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూజీడీ ఇంకా పూర్తి కాలేదని, బస్తీ దవాఖానాలు లేవని తెలిపారు. అభివృద్ధి అంటే ఎమ్మెల్యే ఇల్లు, క్యాంప్ ఆఫీస్ చుట్టూ రోడ్లు వేసుకోవడం కాదని, నగరమంతా వేయాలన్నారు. ప్రయివేటు ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే గణేష్ గుప్తా పరిమితమయ్యారని విమర్శించారు.

నేటి నుంచి 'ప్రజాగోస–బీజేపీ భరోసా'

నగరంలోని అన్ని డివిజన్ల కూడళ్లలో శక్తికేంద్రాల స్ట్రీట్ కార్నర్స్ మీటింగ్ 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని ఫిబ్రవరి 10 నుంచి నిర్వహిస్తున్నామని సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి, అక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తామని, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తామని పేర్కొన్నారు. అర్బన్‌లో రాజకీయ పోరుకు సిద్ధమౌతున్నామని, అర్బన్ ఎమ్మెల్యే పోలీస్ వ్యవస్థను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు, కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, పంచరెడ్డి లింగం, శ్రీధర్, మాస్టర్ శంకర్, నారాయణ యాదవ్, పంచరెడ్డి శ్రీధర్, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం మహిళల ఆందోళన


ఆందోళన చేస్తున్న మహిళలు

- తాత్కాలికంగా వేసిన షెడ్ల తొలగింపు

డిచ్‌పల్లి: ధర్మారం(బి) గ్రామంలోని సాయినగర్ కాలనీలో గల ప్రభుత్వ స్థలంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలువురు పేద మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. గురువారం ఉదయం ఇళ్లు లేని మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి డీ–62 కెనాల్ స్థలంలో కొందరు అక్రమంగా వేసిన తాత్కాలిక షెడ్లను తొలగించారు. సుమారు 20 సంవత్సరాలుగా నీళ్లు రాకపోవడంతో డీ–62 కెనాల్ బంద్ అయింది. దీంతో ఈ స్థలంలో కొందరు తాత్కాలికంగా షెడ్లు వేసుకున్నారు. షెడ్లు వేసుకున్న వారికి మహిళలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. గంటన్నర పాటు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి ఎస్సై కే.గణేష్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఇల్లు లేని నిరుపేదల వినతి మేరకు ఇటీవల ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డెడ్ కెనాల్‌గా మారిన ప్రభుత్వ స్థలంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలనే ఉద్దేశంతో సర్వే చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు డెడ్‌కెనాల్ బఫర్ జోన్ హద్దుల సర్వే కోసం ఉన్నతాధికారుల అనుమతి కోరుతూ నివేదిక పంపించారు. అయితే కొందరు వ్యక్తులు తమ ఇళ్లకు ఆనుకుని ఉన్న కెనాల్ స్థలంలో కబ్జాకు పాల్పడి తాత్కాలిక షెడ్లు వేసుకున్నట్లు మహిళలు ఆరోపించారు. మహిళలు ఆ షెడ్లను తొలగించడంతో కబ్జాదారులతో వాగ్వివాదానికి దిగడంతో అక్కడ కొంతసేపు గందరగోళం నెలకొంది. పోలీసులు సముదాయించడంతో మహిళలు వెనుదిరిగారు.

క్లుప్తంగా

ఆర్థిక సహాయం అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కోటగల్లీ ప్రాంతంలో నివాసముందే బండి సాయి(45) ఈ నెల 7న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు చిన్న పిల్లలు. పేద కుటుంబం కావడంతో శ్రీలక్ష్మీచే యూత సంస్థను ఆశ్రయించగా వెంటనే స్పందించిన సభ్యులు భార్యకు రూ.5 వేలు అందించారు. సంస్థ సెక్రటరీ అలువాల లక్ష్మణ్, శ్యామ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాతపస్వికి నివాళులు



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో కళాతపస్వి విశ్వనాథ్ సంతాప సభ గురువారం నగరంలోని దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించారు. విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చలనచిత్ర దర్శకుడిగానే కాకుండా సంఘ సంస్కర్తగా, సాహితి మూర్తిగా పని చేసిన గొప్ప వ్యక్తని కొనియాడారు. సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, కేశవ కుమార్, సోమేశ్వర్లు, సునీత, పాల్గొన్నారు.

ఆడపిల్లలకు ఆర్థిక భరోసా

సిరికొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజనతో ఆడపిల్లలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ నెల 9, 10 తేదీలలో సుకన్య ఖాతా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గడపగడపకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. పదేళ్లలోపు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు పోస్టాఫీసులలో ఈ ఖాతాను తెరిచి ఉపయోగాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంతకాల సేకరణ



నిజామాబాద్‌నాగారం: బహుజన్ సమాజ్ పార్టీ అర్బన్ నియోజకవర్గంలో నాలుగవ రోజు గురువారం నిజామాబాద్ బస్టాండ్ వద్ద బీసీ సమాజానికి 52 శాతం రిజర్వేషన్లు పెంపు కోసం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు షకీల్ హైమద్, గంగాధర, సూర్య వంశీ యాదయ్య, గంగాధర్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశ్రామిక పర్యటనకు గిరిరాజ్ కళాశాల విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ కళాశాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాదులోని టీ హబ్ వెళ్లారు. కళాశాలలోని టాస్క్ ప్రోగ్రాంకు చెందిన విద్యార్థులు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫీక్ ఆధ్వర్యంలో ఈ పర్యటన చేపట్టారు. టీహబ్‌కు సంబంధించిన విషయాలపై విద్యార్థులకు వివరించారు. పారిశ్రామిక పర్యటనలో భాగంగా విద్యార్థులకు ఈ టూర్ కార్యక్రమం చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

నర్సరీల పరిశీలన

నిజామాబాద్ సిటీ: మండలంలోని పలు గ్రామాలలో నర్సరీలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, అవెన్యూ ప్లాంటేషన్ పనులను గురువారం డీఆర్‌డీవో చందర్‌నాయక్ పరిశీలించారు. మండలంలోని మల్లారం, గాంధీనగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మల్లారం సర్పంచ్ నగేష్, మండల సిబ్బంది పాల్గొన్నారు.

మెంట్రాజ్‌పల్లిలో దంతవైద్యశిబిరం



డిచ్‌పల్లి : మండలంలోని మెంట్రాజ్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం పాఠశాలలో సుమారు 96 మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి దంత పరిరక్షణకు సంబంధించి సూచనలు చేశారు. కార్యక్రమంలో శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయం, రాత్రి దంతాల శుభ్రత తప్పనిసరి


విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రతిరోజు ఉదయం, రాత్రి పడుకునే ముందు దంతాలను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలని వైద్యులు నితీష్ సూచించారు. గురువారం ముదక్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో తిరుమల డెంటల్ కళాశాల సౌజన్యంతో దంత సంరక్షణ, అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. గుట్కా, పొగాకు, చుట్ట, సిగరెట్, బీడీల వల్ల దంత క్షయం జరిగి అనారోగ్యం పాలవుతామని, వాటన్నింటికి దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఆరునెలలకొకసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో 325 మంది విద్యార్థులు, 70 మందికి గ్రామస్తులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ అనుసంగ్యా నాయక్, సంస్థ సీఈవో రాజేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కొనసాగుతున్న అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్(ఏ) శివారులోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం అగ్ని ప్రతిష్ట, బలి ప్రదానం, మంగళ నిరంజనము, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ భక్తుల కోలాహలాల మధ్య ఘనంగా జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభస్వామి వారి కల్యాణోత్సవము, సాయంత్రం హోమము, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

వినాయక ఆలయంలో పూజలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక ఆలయంలో సంకటహరచతుర్థి సందర్భంగా గురువారం టీఎస్ డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


అంగన్‌వాడీలతో టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్: మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వారికి టీఎన్‌జీవో అండగా ఉంటుందని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో టీఎన్‌జీవో జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ మహిళా ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అలుక కిషన్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగం అమృత్ కుమార్, నాయకులు చిట్టి నారాయణరెడ్డి, సుమన్, శేఖర్ పాల్గొన్నారు.

యూత్ పోటీలకు రక్షిత ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్రం ప్రతీ సంవత్సరం నిర్వహించే యూత్ పార్లమెంటు పోటీలలో భాగంగా జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన కుమారి అక్షిత, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచింది. గురువారం అక్షితను నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ బెల్లాల్ శైలి ప్రత్యేకంగా అభినందించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన అక్షిత ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



రక్షితను అభినందిస్తున్న బెల్లాల్ శైలి

ఆంక్షలు లేని జీవనభృతి చెల్లించాలి



డిచ్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

డిచ్‌పల్లి: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ నెలకు రూ.2016లు చొప్పున ఆంక్షలు లేని జీవనభృతి చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యూనియన్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో గోపిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి కేవలం కొంతమందికి మాత్రమే జీవనభృతి ఇవ్వడం తగదన్నారు.

జూడో పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 7వ సబ్ జూనియర్స్ అండ్ కాడెట్ ఇంటర్ జూడో చాంపియన్‌షిప్–2023లో నిజామాబాద్‌లోని రవి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సీహెచ్ అరుణ్ నాయక్, బద్యానాయక్, స్వప్నలు కాంస్య పతకాలు సాధించారు. గురువారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రవి హైస్కూల్ చైర్మన్ కేఎం మహేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని నింపి శిక్షణ ఇచ్చిన పీఈటీ శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

15న మ్యాథమెటిక్స్ సెమినార్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న 'జోవియాలిటీ ఆఫ్ మ్యాథమెటిక్స్' అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం తెయూ వీసీ రవీందర్ తన ఛాంబర్‌లో సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. డిసెంబర్ 22న నిర్వహించే మాథమెటిక్స్ డే కార్యక్రమంలో భాగంగా ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి


ధర్పల్లి: సేవాలాల్ మహారాజ్ జయంతి అయిన ఫిబ్రవరి 15ను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఏఐబీఎస్ఎస్ జిల్లా యువజన అధ్యక్షుడు ధరావత్ గోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. గిరిజన లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌కు గిరిజనుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ మమత

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కులాస్‌పూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మమత సాయిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో 14 రోజులపాటు కంటి వెలుగు శిబిరం కొనసాగుతుందని, 18 ఏళ్లు నిండిన ప్రజలందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందజేస్తారని తెలిపారు. ఎంపీడీవో లింగం నాయక్, ఉప సర్పంచ్ అనిల్‌రెడ్డి, ఏపీఎం మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



సిరికొండ: వైద్య ఆరోగ్య శాఖలో సెకండ్ ఏఎన్ఎంలుగా పని చేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ గఫార్‌మియాకు వారు గురువారం వినతిపత్రం అందజేశారు. సిరికొండ పీహెచ్‌సీలో 18 ఏళ్లుగా పని చేస్తున్నామని, రెగ్యులరైజేషన్ గురించి చలో అసెంబ్లీకి వెళ్తున్న తమను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారని తెలిపారు. మమ్మల్ని రెగ్యులర్ చేయాలని వారు కోరారు. స్వరూప, వనజ, స్వప్న, జమున, రాజమణి, వనిత, కమల తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,550	వెండి (కిలో)	71,500
22 క్యారెట్స్	53,973	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	25	క్యాప్సికం	40	60
బెండకాయ	50	70	గాజరుగడ్డ	20	40
బీరకాయ	50	60	పచ్చిమిర్చి	20	40
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నీసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	50	గోబిపువ్వు	25	40
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	25	50	గోరు చిక్కుడు	45	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	35	60
పుదీనా	40	60			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్–1– అమిగోస్–10.30,1.30,4.30 7.30,10.30
స్క్రీన్–2– పఠాన్(హిందీ)–4.30,10.30 మైఖేల్ –7.30
స్క్రీన్–3– పఠాన్(హిందీ)–1.30 వసంత కోకిల–4.40 రైటర్ పద్మభూషణ్ –7.40,10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1– అమిగోస్–10.30,1.30,4.30 7.30,10.30
స్క్రీన్–2 – రైటర్ పద్మభూషణ్–11.25, 2.05, 8.00,10.40 పఠాన్–హిందీ–4.45
స్క్రీన్–3– పఠాన్–(హిందీ)–12.35,6.45 10.00 పాప్‌కార్న్–(తెలుగు)–3.50
స్క్రీన్–4– ఇట్స్ పూరి లవ్–10.50 చెడ్డి గ్యాంగ్–1.40 వాల్తేరు వీరయ్య –4.35 వసంత కోకిల–7.55 దిల్‌వాలే దుల్హనియా లేజాయింగే –(హిందీ)–10.40

దేవి – అమిగోస్
నటరాజ్ – పఠాన్ (హిందీ)
లలితామహల్ – వాల్తేరు వీరయ్య
శ్రీదేవి – ఐపీఎల్
విజయ్ – వసంత కోకిల

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీల్లో చేర్చండి


ఢిల్లీలో ఓబీసీ కమిషన్ చైర్మన్‌తో వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రతినిధులు.. బీజేపీ ఎంపీ లక్ష్మణ్

- జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన వీరశైవ లింగాయత్ రాష్ట్ర ప్రతినిధులు

బోధన్: సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వీరశైవలింగాయత్‌లను ఓబీసీలలో చేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ల నేతృత్వంలో జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంను గురువారం ఢిల్లీలోని మహారాష్ట్ర భవన్‌లో వీరశైవ లింగాయత్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ప్రస్తుతం వీరశైవ లింగాయత్‌లు బీసీ–డీలో కొనసాగుతున్నారు. ఎంపీలు వీరశైవ లింగాయత్‌ల స్థితిగతులను వినిపించగా.. ఓబీసీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని, ఓబీసీలో చేర్చేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు ఉమ్మడి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులు కందారే దిగంబర్ తెలిపారు. జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసేందుకు ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించిన ఎంపీ బీబీ పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీల ఘనత పీఆర్‌టీయూదే



పలువురిని సన్మానిస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: టీచర్ల బదిలీలు, పదోన్నతులు పీఆర్‌టీయూ ఘనతే అని సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పీఆర్‌టీయూ కార్యాలయంలో సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలువురు సీనియర్ సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో సమస్యలను సాధించిన ఘనత పీఆర్‌టీయూకు ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా సంఘం పని చేస్తున్నదని అన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, నేతలు మాధుసూదన్ రెడ్డి, రాధ, ఆశారాణి, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.